# అన్నా తమ్ముల కథ ఒకటి

బండారు రామ్మోహన్ రావు

ఒక ఊళ్ళో రామన్న భీమన్న అనే అన్నా తమ్ముడు ఉండేవారు. రామన్న పదవ తరగతి వరకు చదువుకొన్నాడు. భీమన్న నిరక్షరాస్యుడు. వీరికి ఉమ్మడిగా కొంత వ్యవసాయ భూమి ఉంది. టౌన్‌కి వెళ్ళి విత్తనాలు, ఎరువు బస్తాలు, పురుగు మందులు తీసుకురావడం రామన్న చేసేవాడు. పొలం దున్నడం, పాడి గేదెల ఆలనా పాలనా చూడటం లాంటి మొరటు పనులన్నీ భీమన్న చూసేవాడు. పండిన పంటని మార్కెట్ కి తీసుకు వెళ్లి అమ్మడంవల్ల వచ్చే పైకాన్ని సినిమాలు, షికార్ల పేరుమీద ఖర్చుపెట్టడం రామన్న చేసేవాడు. తమ్ముడికి తెలియకుండా ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బును తప్పుడు లెక్కలు రాసి తన భార్యకు నగలు, నట్రా కొనిపెట్టేవాడు. భీమన్న అమాయకుడు, అన్న చదువుకున్నవాడు కనుక ఆయనకు అన్ని విషయాలు తెలుస్తాయనీ, తనను మోసం చేయడనీ నమ్మేవాడు. కాని తమ్ముడి అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని రామన్న అన్ని విషయాలలో తమ్ముణ్ణి మోసం చేసేవాడు. సంపాదించింది సరిపోనట్లు ఎప్పటికపుడు కొత్త పద్ధతుల ద్వారా రామన్న తమ్ముణ్ని మోసం చేసేవాడు.

మెల్లమెల్లగా రామన్న ధనవంతుడు అవుతుంటే, వ్యవసాయాన్ని నమ్ముకొన్న భీమన్న బీదవాడు అవుతున్నాడు. గ్రామస్థులందరూ భీమన్నను తెలివితక్కువ వెధవ అని గేలి చేసేవారు. "మీ అన్నయ్య రామన్నలాగ నువ్వు కూడా తెలివిగా ఆలోచించి డబ్బు సంపాదించాలని "భీమన్న భార్య ఒకనాడు సలహా ఇచ్చింది. ఇదేదో బాగుందను కొన్న భీమన్న పండిన పంటను పంపకానికి పెట్టాడు. తనతమ్ముడు తెలివిగల వాడవుతున్నాడని భావించిన రామన్న పంట పండిన తర్వాత పంచు కొనే కంటే పంట వేయక ముందే పంచుకొంటే బాగుంటుందని సలహా ఇచ్చాడు. ఇది ఇంకా బాగుందనుకున్నాడు భీమన్న. అన్నదమ్ములిద్దరూ సాధారణంగా వరి పండించేవాళ్ళు. వరి కంకి పైన ఉంటుంది కాబట్టి పైన నాకు, కింద నీకు అని భీమన్న తెలివిగా పంపకం పెట్టాడు. అప్పుడు రామన్న మరింత తెలివిగా ఆలోచించి ఈ సారి తమ్ముడితో వేరుశనగ పంట వేయించాడు. పంట పండాక కింద కాయలు అన్నకి, పైన మొక్కలు

తమ్మునికి వచ్చాయి. మోసపోయానని తెలుసు కొన్న భీమన్న "కింద, పైనా నాకు- మధ్యలో నీకు" అని షరతు పెట్టాడు. రామన్న ఎల్లాగూ తెలివి కలవాడు కదా! ఈసారి మొక్కజొన్న పైరు వేసాడు. దానితో మధ్యలో వచ్చిన మొక్కజొన్న పొత్తు రామన్న పరమైంది. ఇట్లా నిరక్షరాస్యుడైన భీమన్న అన్నయ్యతో ప్రతీసారి నష్టపోయాడు. ఇక లాభం లేదు అనుకొన్న భీమన్న అన్నయ్యకు తగిన గుణపాఠం చెప్పాలని నిర్ణయం తీసుకొన్నాడు.

ఈసారి పాడి ఆవుల వంతు వచ్చింది. "ఆవు ముందు భాగం నీది వెనక భాగం నాది"అని రామన్న కోరుకొన్నాడు. అమాయకుడైన భీమన్న జరిగే విషయం తెలిసి కూడా ఒప్పుకొన్నాడు. ఆవుకు మేత వెయ్యడం, కుడితి పెట్టడం లాంటి పనులన్నీ తమ్మునికి వచ్చాయి. పాలు పిండుకొనే అవకాశం అన్నకు దక్కింది. రామన్న సంతోషంగా ఆవు పొదుగు దగ్గరకి వెళ్లి పితుక్కోవడానికి కూర్చున్నాడు. రామన్న పితకడం మొదలు పెట్టగానే భీమన్న తన ఆవు మొఖం మీద కర్ర తో బలంగా కొట్టాడు. దానితో ఆవు ఒక్కసారిగా పాలు పితుకుతున్న రామన్నను బలంగా తన్నింది. దానితో రామన్న తమ్ముని మీదకు ఆగ్రహంగా వచ్చాడు. అప్పుడు భీమన్న తాపీగా నవ్వుతూ, "పంటల విషయంలో నన్ను మోసం చేసింది చాలు. ఆవు ముందు భాగం నాకొచ్చింది కదా, నా ఇష్టం వచ్చినట్లు చేస్తాను" అని సమాధానం ఇచ్చాడు. తమ్ముడు తెలివి మీరిపోయాడని గ్రహించిన రామన్న ఇక తమ్ముని మోసంచేయడం మానుకొన్నాడు.

ఆవుకు వేసే మేతలాగే మనం ప్రభుత్వానికి పన్నులు కడుతున్నాం. ప్రభుత్వాలు పాలు పితుక్కోడానికి మాత్రమే అలవాటు పడ్డాయి. మనకేమో గొడ్డు కష్టం, వాళ్లకేమో పాలు మీగడ. మనం కట్టే పన్నుల డబ్బులను అధికారంలో ఉన్నవాళ్ళు యథేచ్ఛగా ఖర్చు పెడుతూ అందిన కాడికి దోచుకొంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. మనమేమో చోద్యం చూస్తూ ఇది ఇంతేనేమోనని సరిపెట్టుకొంటున్నాం. అమాయకుడైన భీమన్నలాగ ప్రతీ సందర్భం లోనూ మనమే నష్టపోతున్నాం. భీమన్న తెలివితో ఆవు మొహంమీద కొట్టినట్టు మనం కూడా ప్రజలను దోచుకొంటున్న రాజకీయనాయకులకు ఓటు ద్వారా బుద్ధి చెప్పినపుడే ఇలాంటి మోసాలు జరగకుండా ఉంటాయి. ఆవుకు మేత వేసేది మనం, దానా పెట్టేది మనం కాబట్టి మన ఆవు పాలూ మనకే దక్కాలి.

---0---